ఓటమి భయంతోనే టీడీపీ దాడులు

తుగ్గలి: ఓటమి భయంతోనే టీడీపీ అధినేత చంద్రబాబు విధ్వంసకాండకు తెగబడ్డారని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి దుయ్యబట్టారు. టీడీపీ దాడులకు నిరసనగా ఆదివారం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో పగిడిరాయి గ్రామంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్నాథరెడ్డి, జిల్లా కమిటీ సభ్యుడు రామచంద్రారెడ్డి, మండల కన్వీనర్ జిట్టా నాగేష్, పార్టీ శ్రేణులతో కలిసి ర్యాలీ నిర్వహించి చంద్రబాబు దిష్టి బొమ్మను దహనం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఉనికిని కాపాడుకునేందుకు బాబు పక్కా ప్లాన్‌తోనే టీడీపీ కార్యకర్తల చేత పోలీసులపై దాడులకు తెగబడ్డారన్నారు. విధ్వంసాలు సృష్టించడం బాబుకు కొత్తేమీ కాదని మండిపడ్డారు. బాబు పాలనలో ప్రజలు ఏనాడు సంతోషంగా లేరన్నారు. 14 ఏళ్లు సీఎంగా పనిచేసినా ఏ ఒక్క ప్రాజెక్టు నిర్మించిన పాపాన పోలేదన్నారు. టీడీపీ కార్యకర్తలను రెచ్చగొట్టి ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టి ఓట్లు వేయించుకోవాలని కలలుగంటున్నారని విమర్శించారు. ఆయనకు రక్షణగా బందోబస్తుకు వెళ్లిన పోలీసులపై దాడులు చేయించిన ఘనత బాబుకే దక్కిందన్నారు. బాబు చేస్తున్న కుట్రలను ప్రజలు గమనిస్తున్నారని, ఆయనకు రాజకీయ సమాధి తప్పని స్పష్టం చేశారు. పోలీసులను తీవ్రంగా గాయపరిచి, వాహనాలు దగ్ధం చేసినందుకు చంద్రబాబు, ఆయన అనుచరులపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బసిరెడ్డి, మోహన్‌రెడ్డి, నాగభూషణరెడ్డి, హుసేన్, సర్పంచ్ సౌజన్య, గోపాల్‌రెడ్డి, చాంద్‌బాషా, సుధాకరరెడ్డి, చంద్రశేఖరరెడ్డి, రఘు, నాగప్ప పాల్గొన్నారు.


పగిడిరాయిలో ఎమ్మెల్యే శ్రీదేవి ఆధ్వర్యంలో చంద్రబాబు దిష్టిబొమ్మ దహనం చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

అల్లర్లకు కారణమైన వారిని శిక్షించాలి

ఆలూరు: రాజకీయ లబ్ధి కోసమే టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు పుంగనూరులో కార్యకర్తలను రెచ్చగొట్టి పోలీసులు, వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడులకు ఉసిగొల్పారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ నారాయణ స్వామి, దేవరగట్టు ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాసులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఈరన్న, ఎంపీపీ రంగమ్మ ఆరోపించారు. ఆలూరులోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఆదివారం మాజీ సీఎం చంద్రబాబు నాయుడు దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 14 ఏళ్లు రాష్ట్రాన్ని పాలించిన చంద్రబాబు ప్రస్తుతం ప్రజల్లో ఆదరణ లేక కుట్రపూరిత రాజకీయాలకు తెరతీశారని మండిపడ్డారు. పుంగనూరులో టీడీపీ శ్రేణులు భౌతిక దాడులకు పాల్పడడం, పోలీసు వాహనాలకు నిప్పు పెట్టడం, ప్రభుత్వ ఆస్తులను విధ్వంసం చేయడాన్ని ఖండించారు. పదవి కోసం ఎన్ని కుట్రలు, కుయుక్తులకు పాల్పడినా ప్రజలు గమనిస్తున్నారని, ఓటుతోనే బుద్ధి చెబుతారన్నారు. దాడులకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు రాంభీమ్‌నాయుడు, బీసీ మాదన్న, హనుమయ్య, వీరేష్, ఈరన్న, నాగేంద్ర, గోవిందు తదితరులు పాల్గొన్నారు.


ఆలూరులో మాజీ సీఎం చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దృశ్యం

రాజకీయ లబ్ధికోసమే చంద్రబాబు కుట్రలు


ఎమ్మిగనూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: రాజకీయ లబ్ధి కోసమే ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు పుంగనూరులో పక్కా ప్లాన్‌తోనే మారణాయుధాలతో దాడులకు పాల్పడేలా కుట్ర పన్నారని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి ఆరోపించారు. ఆదివారం పట్టణంలోని తన నివాసంలో ఎమ్మెల్యే మాట్లాడారు. రాజకీయంగా ప్రజలు ఆకర్షించాలంటే పార్టీ కార్యకర్తలతో కలిసి శాంతియుతంగా సభలు నిర్వహించుకోవాలేకాని, కత్తులు, కర్రలను వెంట తీసుకెళ్లాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. రాజకీయ లబ్ధి కోసం ప్రశాంతంగా ఉండే ప్రజల మధ్య అల్లకల్లోలం సృష్టించి రాష్ట్రాన్ని రావణకాష్టంగా మార్చాలని చంద్రబాబు చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పుంగనూరులో రోడ్‌షోకు ఎలాంటి అనుమతుల్లేకపోయినా రౌడీలు, గూండాలతో వెళ్లి విధ్వంసానికి బాబు కారకుడయ్యాడన్నారు. ఉనికిని కాపాడుకోవాలనే తలంపుతో టీడీపీ విధ్వంసాలకు పాల్పడుతోందని విమర్శించారు. చంద్రబాబు హయాంలో ఏ ప్రాజెక్టు నిర్మించారో చెప్పాలని సవాల్ విసిరారు. గత ఎన్నికల ముందు ఆర్‌డీఎస్ నిర్మాణం చేపడతామంటూ టెండర్లు నిర్వహించి కాంట్రాక్టర్లతో ముడుపులు తీసుకొన్నారని, గురురాఘవేంద్ర ప్రాజెక్టు, వేదావతి ప్రాజెక్టుల పనులపై కమీషన్లు దండుకుని నిర్మాణంలో మాత్రం చేతులెత్తేశారని మండిపడ్డారు. దివంగత నేత వైఎస్సార్ హయాంలో నియోజకవర్గంలో పులికనుమ ప్రాజెక్టును నిర్మించారని గుర్తుచేశారు. పట్టణంలోని అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం (యూజీడీ) పూర్తి చేసేందుకు కాంట్రాక్టర్లకు పాత రేట్లు గిట్టుబాటు కాకపోవడంతో కొత్త రేట్ల ప్రకారం పనులు చేపట్టేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని, త్వరలో పనులు పూర్తి చేస్తామన్నారు. వైఎస్‌ఆర్‌సీపీ మండల కన్వీనర్ బీఆర్ బసిరెడ్డి, పార్టీ పట్టణాధ్యక్షుడు బుట్టారంగయ్య, పార్టీ నాయకులు భీమిరెడ్డి, రియాజ్‌అహమ్మద్, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, ముగతి సర్పంచ్ విరుపాక్షిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నందవరం నాయకులు

కుట్ర రాజకీయాలు చంద్రబాబుకే చెల్లు

నందవరం: కుట్ర రాజకీయాలు టీడీపీ అధినేత చంద్రబాబుకే చెల్లుతాయని వైఎస్సార్‌సీపీ నందవరం మండల కన్వీనర్ శివారెడ్డిగౌడ్, సీనియర్ నేత లక్ష్మికాంతరెడ్డి, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు విరుపాక్షిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు నిఖిల్‌చక్రవర్తి ఆరోపించారు. ఆదివారం మండలకేంద్రంలో వారు మాట్లాడుతూ.. చిత్తూరు జిల్లా పుంగనూరులో టీడీపీ శ్రేణులు సృష్టించిన అలజడి అత్యంత హేయనీమన్నారు. చంద్రబాబు రాజకీయ భవిష్యత్తు కోసం పోలీసులపై దాడులు చేయించడం దారుణమన్నారు. కార్యకర్తలను రెచ్చగొట్టి దాడులకు ఉసిగొల్పారని, సొంత పార్టీ నేతలే ఆయన తీరుపై ఆందోళన చెందుతున్నారని చెప్పారు. చంద్రబాబుపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు శివన్న, వెంకటేశ్వరరెడ్డి, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీకి రాజకీయ సమాధి తప్పదు

ఆలూరు: ప్రజలు సుపరిపాలననే కోరుకుంటారని, టీడీపీపై ఎవరికీ నమ్మకం లేదని ఉమ్మడి జిల్లా పంచాయతీరాజ్ వింగ్ అండ్ జోనల్ ఇన్‌చార్జ్, చిప్పగిరి జెడ్పీటీసీ సభ్యుడు విరుపాక్షి అన్నారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలు అన్ని విధాలుగా విసుగు చెంది టీడీపీ పాలనను తిరస్కరించారని పేర్కొన్నారు. ప్రాజెక్టుల పరిశీలన పేరుతో మాజీ సీఎం చంద్రబాబునాయుడు పర్యటనలు చేస్తూ కార్యకర్తలను రెచ్చగొట్టి దాడులకు ఉసిగొల్పడం మంచిది కాదన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై, పోలీసులపై రాళ్లు విసరడం, ఇనుప రాడ్లు, కత్తులతో దాడి, పోలీసు వాహనాలను ధ్వంసం చేసి నిప్పు పెట్టడాన్ని ఆయన ఖండించారు. ఇలాంటి చర్యలకు పాల్పడితే మంచి పేరు వస్తుందనే భ్రమలో టీడీపీ నాయకులు ఉన్నారని, ఆ పార్టీకి రాజకీయ సమాధి తప్పదన్నారు.


వివేకానంద ఆశ్రమ నిర్వాహకులకు రూ.25 వేలు విరాళం అందిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు విరుపాక్షి

రూ.25 వేలు విరాళం: ములగవెల్లి గ్రామంలో వివేకానంద ఆశ్రమ నిర్వాహకులకు జెడ్పీటీసీ విరుపాక్షి ఆదివారం రూ.25 వేలు విరాళం అందజేశారు. ట్రస్టు నిర్వాహకులు ఆయన్ను ఘనంగా సన్మానించారు.

8న బండలాగుడు పోటీలు

వెల్దుర్తి: మండల పరిధిలోని కలుగొట్ల గ్రామంలో కొడు పీర్ల ఉత్సవాల్లో భాగంగా 8న పెద్ద సరిగెత్తు, 9న పీర్లు ఏటికి తరలనున్నాయి. ఈ సందర్భంగా దివంగత చెరుకులపాడు నారాయణరెడ్డి జ్ఞాపకార్థం ఈనెల 8న మంగళవారం బండలాగుడు పోటీలు జరుపనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అంతర్ రాష్ట్రస్థాయిలో పాలపళ్ల (ఆరు పళ్లు) విభాగంలో నిర్వహించనున్న పోటీలలో విజేతకు రూ.35 వేలు, తదుపరి నాలుగు బహుమతులు వరుసగా రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు అందించనున్నామన్నారు. పాల్గొనదలచిన వృషభాల యజమానులు 81068 94468, 95812 48644 నంబర్లలో సంప్రదించాలని కోరారు. ఉత్సవాలలో భాగంగా 8న రాత్రి చెక్కభజన ఉంటుందన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

తుగ్గలి: ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. విశ్వభారతి వైద్య కళాశాల, జనరల్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం పగిడిరాయిలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. వైద్య శిబిరంలో 230 మందికి వైద్యులు పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 40 మందిని వైఎస్సార్ ఆరోగ్య శ్రీ పథకం కింద శస్త్ర చికిత్సలకు రెఫర్ చేసినట్లు ఆస్పత్రి మేనేజర్ శివకుమార్ తెలిపారు. ఆస్పత్రి చైర్మన్ కాంతారెడ్డి, వైద్యురాలు వర్ష, స్థానిక నాయకులు పాల్గొన్నారు.


పగిడిరాయిలో వృద్ధురాలికి చుక్కల మందు వేసి శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీదేవి

బాధిత కుటుంబానికి పరామర్శ

ఇటీవల సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు చెన్నంపల్లి వెంకటేశ్వరరెడ్డి అనారోగ్యంతో మృతిచెందడంతో బాధిత కుటుంబసభ్యులను ఎమ్మెల్యే శ్రీదేవి పరామర్శించారు. ఆయన చిత్రపటం వద్ద నివాళి అర్పించి భార్య, కుమారులను ఓదార్చారు. అన్ని విధాలా అండగా ఉంటామని ఆ కుటుంబానికి భరోసా ఇచ్చారు. వెంకటేశ్వరరెడ్డి మృతి పార్టీకి తీరని లోటన్నారు.

ఆలయాభివృద్ధికి విరాళం

మద్దికెర: స్థానిక సుబ్రహ్మణ్యస్వామి దేవాలయ అభివృద్ధికి గ్రామానికి చెందిన చందం గోపాల్, రామలక్ష్మి దంపతులు రూ.27 వేలు విరాళం అందించారు. వారి కుమారుడు ప్రవీణ్‌కుమార్‌కు రైల్వేలో ఉద్యోగం రావడంతో స్వామివారిని దర్శించుకుని విరాళం అందించినట్లు ఆలయ నిర్వాహకులు విజయ్‌ప్రసాద్ ఆదివారం తెలిపారు. దాతలకు స్వామివారి జ్ఞాపిక అందజేసి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

హొళగుంద: మండల పరిధిలోని మార్లమడికి, హొళగుంద గ్రామాలకు చెందిన ఒంటరి వృద్ధులు, దివ్యాంగులు నిరుపేదలకు ఆదివారం ఆదోని వివేకానంద సేవా సంస్థ, భారత్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. స్వచ్ఛంద సేవా సంస్థల అధ్యక్ష, ఉపాధ్యక్షులు మూర్తి, ప్రకాష్, సిద్దార్థగౌడ్ తదితరుల ఆధ్వర్యంలో బియ్యం, కందిబ్యాళ్లు, వంటనూనె, చక్కెర, ఇతర సరుకులను అందజేశారు.

బీఎస్ఎన్ఎల్ ఫైబర్‌నెట్ తీగల కత్తిరింపు

- 24 గంటల పాటు స్తంభించిన ఇంటర్నెట్ సేవలు

పత్తికొండ రూరల్: పత్తికొండ, బురుజుల గ్రామాల పరిధిలోని 86 బీఎస్ఎన్ఎల్ ఫైబర్ నెట్ కనెక్షన్ ఇంటర్నెట్ సేవలు 24 గంటల పాటు స్తంభించాయి. శనివారం మధ్యాహ్నం నుంచి ఇంటర్నెట్ కనెక్షన్ లేకపోవడంతో వినియోగదారులు సర్వీసు ప్రొవైడర్ల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన నిర్వాహకులు పరిశీలన చేపట్టి 8 చోట్ల విద్యుత్ స్తంభాల జంక్షన్ వద్ద కనెక్షన్లు కత్తిరించినట్లుగా గుర్తించారు. మూడు టీంలుగా శ్రమించి ఆదివారం సాయంత్రం సేవలను పునరుద్ధరించారు. గతంలో బీఎస్ఎన్ఎల్ బ్రాడ్‌బ్యాండ్ సేవలను వినియోగిస్తున్న చాలా మంది ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, ఇంటర్నెట్ షాపులకు హైస్పీడ్ ఇంటర్నెట్ అందుబాటులో ఉంటుందని ఫైబర్‌నెట్ కనెక్షన్‌లు తీసుకున్నారు. వీటిలో ప్రభుత్వ కార్యాలయాలు అనేకం ఉండగా ప్రజలతో ముడిపడిన సేవలు అనేకం ఉండటంతో సీఐ మురళీమోహన్ పోలీసులతో కలిసి విచారణ చేపట్టారు. పాతగుంతకల్లు, వజ్రకరూరు టెలికాం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రొవైడర్‌గా పనిచేస్తున్న బురుజులకు చెందిన నగిరి హనుమంతు ఉద్దేశపూర్వకంగా వైర్లు కత్తిరించినట్లుగా గుర్తించారు. పోలీసు స్టేషన్‌కు పిలిపించి విచారణ చేశారు. పత్తికొండ, తుగ్గలి సర్వీసు ప్రొవైడర్‌గా ఉన్న హరికృష్ణ నుంచి తనకు రావాల్సిన నగదులో మనస్పర్థలతో ఇలా చేసినట్లు ఒప్పుకున్నట్లు సీఐ తెలిపారు. అయితే వ్యక్తిగతమైన లావాదేవీలతో ప్రజోపయోగకరమైన సేవలకు అంతరాయం కలిగించడం సరికాదని, ఇలాంటి చర్యలు పునరావృతమైతే చట్టపరమైన చర్యలు తీసుకోకతప్పదని మందలించారు.


పత్తికొండలో కత్తిరించిన బీఎస్ఎన్ఎల్ ఫైబర్‌నెట్ వైర్లు

రైతు ఆత్మహత్యాయత్నం

వెల్దుర్తి: రామళ్లకోటకు చెందిన రైతు బాలంజనేయులు ఆదివారం ఆత్మహత్యకు ప్రయత్నించాడు. ఆయన గత ఖరీఫ్ నుంచి ఉల్లి, మిరప పంటలు సాగు చేయగా నష్టాలు రావడంతో అప్పులపాలై ఆందోళన చెందాడు. ఈ స్థితిలో సోమవారం ఇంట్లో ఫ్యానుకు ఉరి వేసుకున్నాడు. గమనించిన కుటుంబసభ్యులు కిందకు దించి 108కు సమాచారం అందించారు. గొంతు వద్ద నరాలు ఉబ్బి ఊపిరాడని పరిస్థితిలో ఉన్న బాలంజనేయులును అంబులెన్స్ సిబ్బంది ఆక్సిజన్ అందిస్తూ కర్నూలు ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం రైతు పరిస్థితి నిలకడగా ఉన్నట్లు తెలిసింది. బాలాంజనేయులు ఏడాది క్రితం కూడా పురుగు మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించగా చికిత్స అందించడంతో కోలుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

అల్లర్లు సృష్టించేందుకు టీడీపీ కుట్రలు

చిప్పగిరి: ప్రాజెక్టుల సందర్శన పేరుతో రాష్ట్రంలో అల్లర్లు సృష్టించడానికి మాజీ సీఎం నారా చంద్రబాబునాయుడు ప్రయత్నిస్తున్నారని ఎంపీపీ జూటూరు హేమలత అన్నారు. ఆమె ఆదివారం మాట్లాడుతూ.. టీడీపీ నాయకుడు నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రకు ఆదరణ లేకపోవడంతో చంద్రబాబు ప్రాజెక్టుల సందర్శన పేరుతో ప్రజల్లోకి వెళ్లి కార్యకర్తలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. పుంగనూరులో జరిగిన ఘటనకు చంద్రబాబు పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. బాబు మాయలో పడి టీడీపీ కార్యకర్తలు జైళ్లపాలు కాకుండా జాగ్రత్త వహించాలని హితవుపలికారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మారయ్య, లాల్‌స్వామి, ధనుంజయ తదితరులు ఉన్నారు.

రూపురేఖలు మారిన హలిగేర రోడ్డు


నాడు - హలిగేర రోడ్డు దుస్థితి,


నేడు - రాకపోకలకు అనువుగా రూపుదిద్దుకున్న బీటీ రోడ్డు

ఆస్పరి: మండలంలోని హలిగేర గ్రామానికి వెళ్లే రోడ్డు రూపురేఖలు మారిపోయాయి. ఆదోని రోడ్డు నుంచి 4 కి.మీ దూరంలో ఉన్న హలిగేరకు ప్రభుత్వం రూ.45 లక్షలతో బీటీ రోడ్డు నిర్మించడంతో వాహనాల రాకపోకలకు సౌకర్యంగా మారింది. గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా హలిగేరకు వచ్చిన కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాంకు గ్రామస్తులు రోడ్డు సమస్యను పరిష్కరించాలని కోరారు. స్పందించిన మంత్రి చొరవ తీసుకొని బీటీ రోడ్డుకు రూ.45 లక్షలు మంజూరు చేయించారు. ఈ మేరకు కంట్రాక్టర్ బీటీ రోడ్డు పనులు పూర్తి చేయడంతో వాహనాదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు మంజూరుపై గ్రామస్తులు, సర్పంచ్ లింగమ్మ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు,

‘భలే మంచి చౌక బేరము’

వెల్దుర్తి: మటన్ ప్రియులకు వెల్దుర్తి పట్టణంలో ‘భలే మంచి చౌక బేరము’ లభిస్తోంది. వివరాలు.. పట్టణంలోని సంతమార్కెట్‌లో పంచాయతీ ఆధీనంలోని షాపులో కటికె చాంద్‌బాషా మాంసం దుకాణం నిర్వహిస్తున్నాడు. నెల రోజులుగా షాపులో పొట్టేలు మాంసం కిలో రూ.600 అంటూ బోర్డు పెట్టి విక్రయాలు సాగిస్తున్నాడు. తక్కువ ధరకు నాణ్యమైన మటన్ దొరుకుతుండడంతో మాంసం ప్రియులు అక్కడికి క్యూ కడుతున్నారు. దీంతో నెల రోజుల్లోనే విక్రయాలు నాలుగు రెట్లు పెరిగాయని, గతంలో ఆదివారం రోజున రూ.35 వేలు జరిగే వ్యాపారం, ప్రస్తుతం రూ.లక్షకు చేరుకుందని నిర్వాహకుడు చాంద్‌బాషా తెలిపారు. కిలో రూ.600 ధరతో లక్ష రూపాయల వ్యాపారం జరిగితే రూ.2 వేల నుంచి రూ.3 వేలు మిగులుతుందని, నాణ్యతలో ఏ మాత్రం రాజీ పడబోనని చాంద్ బాషా పేర్కొంటున్నారు. మాసం బాగాలేకపోతే ఒకసారి తీసుకెళ్లిన వారు మళ్లీ రారని వ్యాపారాభివృద్ధే ధ్యేయంగా తక్కువ ధరకు అందిస్తున్నాని, కష్టమర్లు పెరిగినా రేటు తగ్గించబోనని చెబుతున్నాడు. అలాగే మటన్ ధరపై చుట్టుపక్కల పల్లెల్లో దండోరా, కరపత్రాల రూపంలో ప్రచారం సాగిస్తుండడం విశేషం.


వెల్దుర్తి సంతమార్కెట్ వద్ద దుకాణంలో మాంసం కిలో రూ.600కు విక్రయిస్తున్న కటికె చాంద్‌బాషా

మంచి దిగుబడులకు మార్గం ‘పొలంబడి’

- అధిక దిగుబడులే లక్ష్యంగా వైఎస్సార్ పొలంబడి కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం
- క్షేత్రస్థాయిలో అధికారులకు సలహాలు సూచనలు ఇస్తున్న వ్యవసాయ సిబ్బంది
- సూచనలు పాటిస్తే రైతన్నలకు మేలు


ఆలూరు వ్యవసాయ కార్యాలయంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ వెంకటేశ్వర గౌడ్


ఆలూరులో వైఎస్సార్ పొలంబడి నిర్వహిస్తున్న వ్యవసాయ అధికారులు

ఆలూరు రూరల్: రైతులు పంటల సాగులో అధిక పెట్టుబడులు పెడుతున్నారు. అయినా పంట చేతికి వచ్చే సమయానికి మంచి దిగుబడి అందక నిరాశ చెందుతున్నారు. తక్కువ ఖర్చుతో నాణ్యమైన, అధిక దిగుబడులు సాధించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో వ్యవసాయ అధికారులు పొలంబడి కార్యక్రమం ద్వారా రైతులకు సలహాలు సూచనలు ఇస్తున్నారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం ఖరీఫ్‌లో వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం నిర్వహిస్తోంది. ఆలూరు వ్యవసాయ సబ్ డివిజన్‌లోని 76 ఆర్బీకేల పరిధిలో ఉన్న రైతుల పొలాల్లో పొలంబడి కార్యక్రమం చేపట్టింది.

పొలం బడి నిర్వహణ ఇలా..

వైఎస్సార్ పొలంబడి కార్యక్రమాన్ని ఖరీఫ్ సీజన్‌లో నిర్వహించడానికి వ్యవసాయ అధికారులు శ్రీకారం చుట్టారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో అత్యధికంగా సాగు చేసిన పత్తి, వేరుశనగ, కంది తదితర పంటలను గుర్తిస్తారు. మండలం నుంచి 8 మంది రైతులను ఎంపిక చేసి వారి పొలంలో కనీసం రెండు ఎకరాల్లో సాగు చేసిన పంట నుంచి సాధించాల్సిన అధిక దిగుబడి, వాడాల్సిన పురుగు మందులు, ఎరువులు ఎంత మోతాదులో వాడాలో తెలియజేస్తారు. అలాగే పంటకు చీడపీడలు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేస్తున్నారు. ప్రతి వారం తప్పకుండా ఆ గ్రామంలో వ్యవసాయ అధికారులు పర్యటిస్తారు. నాలుగు లేదా 5 గంటల వరకు ఆ రైతు పొలంలోనే ఉండి పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సలహాలు సూచనలు ఇస్తారు. సబ్ డివిజన్‌లో 76 ఆర్బీకేల పరిధిలోని 76 మంది క్షేత్రస్థాయి సిబ్బందితో పాటు మండల వ్యవసాయ అధికారులు హాజరవుతారు.

మేలైన దిగుబడి సాధన కోసం..

పొలంబడి కార్యక్రమానికి ఎంపిక చేసిన పొలాల్లో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. ఆరోగ్యకరమైన పంటలు పెంచడం, పురుగులను సంరక్షించడం, క్రమం తప్పకుండా పొలం పరిశీలన, పంటల సాగులో మెలకువలు పాటించి అధిక దిగుబడులు సాధించే రైతులను గుర్తించడం, రైతులు యాజమాన్య పద్ధతులను పాటించేలా చూడడం అధికారులు బాధ్యతగా తీసుకుంటారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకం ద్వారా అధిక దిగుబడులు సాధించి అధిక ఆదాయం పొందేలా అధికారులు సలహాలు, సూచనలు అందిస్తారు. రైతులకు రాయితీపై జిప్సం, బోరాన్, వేప పిండి వంటివి ప్రభుత్వం అందజేస్తుంది.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



వైఎస్సార్ పొలంబడి ద్వారా అధికారులు సూచించిన సలహాలను రైతులు తప్పనిసరిగా పాటించాలి. పంటల సాగులో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించడం, మిత్ర, శత్రు పురుగుల నిర్వహణ తదితర వాటి ద్వారా అధిక దిగుబడులు పొందాలి. పొలంబడి కార్యక్రమం కోసం వ్యవసాయ సబ్ డివిజన్‌లోని అన్ని పంచాయతీలలో రైతులకు గుర్తించి వారి పొలాలు ఎంపిక చేశాం. రసాయన ఎరువులను నియంత్రించి సేంద్రియ ఎరువుల వాడకంతో పంటలు పండించేలా అవగాహన కల్పిస్తున్నాం. వారానికి రెండు సార్లు పొలం సందర్శించి తగిన సలహాలు అందిస్తాం.

– సునీత, ఏడీఏ, ఆలూరు

మోడల్ స్కూలుకు బస్సు నడపాలి

ఆస్పరి: మండలంలోని పుటుకలమర్రి వద్ద ఉన్న మోడల్ స్కూల్‌కు ఆదోని ఆర్టీసీ బస్సు సర్వీసు నడపాలని జాషువా ఫౌండేషన్ చైర్మన్ దేవేంద్రయ్య ఆ డిపో మేనేజర్‌ను కోరారు. ఆదివారం ఆస్పరిలో ఆయన మాట్లాడుతూ.. మండలంలోని 33 గ్రామాల నుంచి మోడల్ స్కూల్లో 800 మంది విద్యార్థులు చదువుకుంటున్నారన్నారు. ప్రతి రోజు పాఠశాలకు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఆటోలలో వెళ్లేందుకు డబ్బులు లేక పేద విద్యార్థులు అవస్థలు పడుతున్నారని వాపోయారు. ఆదోని డిపో మేనేజర్ చర్యలు చేపట్టి విద్యార్థి బస్సు నడపాలని కోరారు.

వాల్మీకి సంఘం కమిటీ ఎన్నిక

పత్తికొండ రూరల్: స్థానిక పబ్లిక్ రీడింగ్ రూం ఆవరణలో ఆదివారం జరిగిన వాల్మీకి సంఘం సమావేశంలో మండల అధ్యక్షుడిగా బి.రాముడు, ప్రధాన కార్యదర్శిగా బిల్లేని ఆదినారాయణ, మరికొందరిని కార్యవర్గ సభ్యులుగా ఆ సంఘం జాతీయ కార్యదర్శి ఆస్పరి శ్రీనివాసులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బీసీ సంఘం తాలుకా అధ్యక్షుడు నాగేంద్ర, పుచ్చకాయల మాడ రాముడు, శేఖర్, హోసూరు కేశవ పాల్గొన్నారు.

నిందితుల అరెస్ట్

ఆస్పరి: మండలంలోని వలగొండ గ్రామంలో మొహర్రం పండుగ సందర్భంగా దళితులపై దాడి చేసిన నిందితులను పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, ఆలూరు సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆస్పరిలో అరెస్టు చేసి ఆదివారం రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ వరప్రసాద్ తెలిపారు. నిందితులు నాగేంద్రయ్య, అంజినప్ప, వెంకట్రాముడు లక్ష్మన్నతోపాటు మరో 24 మందిని అరెస్టు చేసినట్లు వెల్లడించారు.

క్లుప్తంగా

ఆర్‌ఏఎఫ్ జవాన్ల కవాతు


వలగొండలో కవాతు చేస్తున్న ఆర్‌ఏఎఫ్ జవాన్లు

ఆస్పరి: ఆస్పరి మండలంలోని వలగొండ గ్రామంలో ఆదివారం రాపిడ్ యాక్షన్ ఫోర్స్ (ఆర్ఏఎఫ్) బృందం ఆలూరు సీఐ వెంకటేశ్వర్లు, ఆస్పరి ఎస్ఐ వరప్రసాద్ ఆధ్వర్యంలో కవాతు నిర్వహించింది. గ్రామంలోని ఎస్సీ, బీసీ కాలనీల్లో ర్యాలీ కొనసాగింది. వలగొండ గ్రామంలో మొహర్రం పండుగ సందర్భంగా ఇరువర్గాల వారు ఘర్షణ పడడంతో పలువురు గాయపడ్డారు. ప్రజల్లో భయాందోళనలు పోగొట్టేందుకు కవాతు నిర్వహించి గ్రామస్తులకు భరోసా కల్పించారు. సుమారు 60 మంది ఆర్ఎఎఫ్ సిబ్బందితో పాటు స్థానిక పోలీసులు ఫ్లాగ్ మార్చ్‌లో పాల్గొన్నారు.

పత్తికొండ రూరల్: ఇటీవల చోటుచేసుకున్న హింసాత్మక ఘటనల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్, పట్టణ పోలీసులు ఆదివారం ప్రధాన రోడ్డులో కవాతు నిర్వహించారు. డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో 99వ బెటాలియన్ సెంట్రల్ ఫోర్స్‌కు చెందిన ముగ్గురు సీఐలు, ఇద్దరు ఎస్ఐలు, 90 మంది స్పెషల్ పోలీసులు, పట్టణ పోలీసులు 10 మంది కలిసి వంద మందితో మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. సీఐ మురళీమోహన్, ఎస్ఐలు పాల్గొన్నారు.

హొళగుంద: గ్రామాలలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆలూరు సీఐ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. ఆదివారం సీఐ, హొళగుంద ఎస్ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో హొళగుంద, కోగిలతోట గ్రామాలలో రాపిడ్ యాక్షన్ ఫోర్స్(ఆర్ఏఎఫ్) బలగాలు కవాతు నిర్వహించాయి. అంతకు ముందు హొళగుంద పోలీసుస్టేషన్‌లో సీఐ మాట్లాడుతూ సమస్యాత్మక గ్రామాలలో ఆర్ఏఎఫ్ బలగాలు పర్యటించి ప్రజలకు ధైర్యం కల్పిస్తున్నట్లు చెప్పారు.

యువ రైతు ఆత్మహత్య

దేవనకొండ: మండలంలోని తెర్నెకల్ గ్రామానికి చెందిన బోయ రవికిరణ్ (24) పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు... రవికిరణ్ తనకున్న ఎకరా పొలంతో పాటు ఐదెకరాలు కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. గతేడాది పత్తి, వేరుశనగ, టమాట తదితర పంటలు సాగుచేసి వర్షాభావ పరిస్థితుల వల్ల నష్టపోయాడు. రూ.10 లక్షల దాకా అప్పుల పాలయ్యాడు. ఈ ఏడాదైనా పంటలు పండుతాయన్న ఆశతో పత్తి సాగుచేయగా పైరు ఎదుగుదల లేక నష్టపోయాడు. అప్పులు పెరగడంతో మనస్తాపానికి గురై శనివారం రాత్రి పురుగు మందు తాగాడు గమనించిన కుటుంబ సభ్యులు కర్నూలు ఆస్పత్రికి తరలించగా కోలుకోలేక ఆదివారం మధ్యాహ్నం మృతిచెందాడు. మృతుడి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ భూపాలుడు తెలిపారు.

కడుపునొప్పి తాళలేక..


ఖాదర్‌బాషా(ఫైల్)

ఆలూరు రూరల్: కడుపు నొప్పితాళలేక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల.. మండలంలోని కురుకుంద గ్రామానికి చెందిన ఖాదర్ బాషా (38) శనివారం రాత్రి 10 గంటలకు పురుగు మందు తాగాడు. గమనించిన బంధువులు ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స చేసిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం ఆదోనికి, అక్కడి నుంచి కర్నూలు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోని మృతిచెందాడు. మృతదేహానికి కర్నూలు ఆస్పత్రిలో పోస్టు మార్టం నిర్వహించి ఆదివారం బంధువులకు అప్పగించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాయక్ చెప్పారు.

10న మార్కెట్ హక్కుల వేలం

ఆస్పరి: మండలంలోని తంగరడోణ గ్రామంలో ఈనెల 10వ తేదీన కూరగాయల మార్కెట్ నిర్వహణ హక్కులు వేలం వేయనున్నట్లు సర్పంచ్ శంకరమ్మ ఆదివారం తెలిపారు. ఆసక్తి గల వారు రూ.50 వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనవచ్చన్నారు.

అందుబాటులో యూరియా

ఆస్పరి: ఆస్పరి ఆర్‌బీకేకు ప్రభుత్వం 12 టన్నుల యూరియాను మంజూరు చేసినట్లు వీఏఏ అనీల్ కుమార్ నాయుడు తెలిపారు. యూరియాను స్థానిక ఆర్‌బీకే కేంద్రంలో అందుబాటులో ఉంచామని, అవసరమైన రైతులు నగదు చెల్లించి తీసుకెళ్లవచ్చన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

వెల్దుర్తి: పోటీ ప్రపంచంలో పేద విద్యార్థులు వెనుకబడరాదని, వారికి అవసరమైన సౌకర్యాలు కల్పిస్తూ నాణ్యమైన విద్య అందివాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని జెడ్పీటీసీ సభ్యుడు దాదిపోగు సుంకన్న అన్నారు. ఆదివారం స్థానిక ఎస్సీ బాలుర హాస్టల్‌లో వార్డెన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 202 మంది విద్యార్థులకు జెడ్పీటీసీ చేతులమీదుగా బెడ్‌షీట్లు, విద్యాసామగ్రి కిట్లను అందించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను ఉపయోగించుకుని విద్యార్థులు బాగా చదువుకోవాలని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

దేవనకొండ: మండలంలోని జిల్లెడబుడకల పంచాయతీలోని మాదాపురం గ్రామంలో మంత్రి గుమ్మనూరు జయరాం సహకారంతో తాగునీటి సమస్య పరిష్కారమైంది. వైఎస్సార్‌సీపీ నాయకులు దివాకర్‌నాయుడు ఆధ్వర్యంలో గ్రామంలో ఆదివారం రెండు బోర్లు వేయించారు. ఒక దానిలో మూడు ఇంచులు, మరొక దానిలో రెండు ఇంచుల నీరు పడ్డాయి. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.